సాక్షి పెద్దపల్లి

గురువారం । 24 । ఏప్రిల్ । 2025



ఘనంగా బీరప్ప కొలుపు

కమాన్‌పూర్: జూలపల్లి గ్రామంలో బీరప్ప కొలుపు ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎడ్లబండ్లలో పాలపారక తీసుకొచ్చారు. గొల్ల, కురుమలు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాల పరిశీలన

మంథని: గుంజపడుగు, అంగ్లూర్, మంథనిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ వేణు, సహకార అధికారి శ్రీమాల, పలువురు అధికారులు పరిశీలించారు.

గరిష్ఠం/కనిష్ఠం
44.5/34.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండగా, ఉక్కపోతగా, అసౌకర్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్ఫూర్తికి అభినందన



విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని కన్నాపురం స్ఫూర్తి ఇంటర్ హెచ్‌ఈసీలో 1000 మార్కులకు 978 మార్కులు సాధించడంతో అధికారులు అభినందించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి కల్పన, అడిషనల్ కలెక్టర్ వేణు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. విద్యార్థిని తండ్రి నాగేందర్, అధ్యాపకులు సంపత్, నరేశ్, శంకర్ పాల్గొన్నారు.

కర్రిగుట్టలో కూంబింగ్ ఆపండి



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కర్రిగుట్టలో సాయుధ పోలీసు బలగాలు చేపట్టిన కూంబింగ్‌ను ఆపేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని పౌరహక్కుల సంఘం నాయకులు మాదన కుమారస్వామి, రాజగోపాల్, సుచరిత కేంద్రప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీలపై అణచివేతను ఆపాలన్నారు. మావోయిస్టు ఉద్యమకారులను హతమార్చడాన్ని నిలిపివేయాలని వారు కోరారు. సమావేశంలో నాయకులు పర్వతాలు, సత్యనారాయణ, విశ్వనాథ్, బాలసాని రాజయ్య, గాండ్ల మల్లేశం, మార్వాడి సుదర్శన్, బాపు, మల్లయ్య, సదానందం, రాజమల్లయ్య, రత్నకుమార్, రవీందర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అబ్జర్వర్ల నియామకం

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పీసీసీ అబ్జర్వర్లగా సయ్యద్ అజ్మాతుల్లా హుస్సేనీ, సంగీతం శ్రీనివాస్‌ను పీసీసీ నియమించింది. తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆమోదంతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అబ్జర్వర్లను ప్రకటించారు. వీరు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకుపోయేందుకు పనిచేయనున్నారు. పార్టీ కార్యకర్తలను కలుసుకొని పార్టీ పరిస్థితిపై ఆరా తీయనున్నారు. త్వరలో ప్రకటించబోయే డీసీసీ, మండల, బ్లాక్ అధ్యక్షుల నియామకం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి పీసీసీకి నివేదించనున్నారు. ఆయా నివేదికల ఆధారంగా నేతలకు కాంగ్రెస్ పార్టీలో పదవులు వరించనున్నాయి.

5న టాలెంట్ టెస్ట్

పెద్దపల్లిరూరల్: అనాథ విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మే 5న పీపీటీ (పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్) టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా బాధ్యులు కుమారస్వామి, లక్ష్మణ్ తెలిపారు. టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్య అందిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4, 5, 6వ తరగతుల్లో ప్రవేశానికి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 94385 81045, 98854 46299 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఓపెన్ తరగతులు ప్రారంభం

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ తరగతులు ఈ నెల 20న ప్రారంభించామని ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. అడ్మిషన్ పొందిన వారు తరగతులకు హాజరు కావాలని కో ఆర్డినేటర్ షుకూర్ కోరారు.

లివర్ సిరోసిస్ బాధితులకు ప్రత్యేక సెలవు

గోదావరిఖని: తీవ్ర కాలేయ జబ్బు(లివర్ సిరోసిస్) బారినపడిన సింగరేణి కార్మికులకు సగం జీతంతోపాటు ప్రత్యేక సెలవు మంజూరు చేస్తూ యాజమాన్యం బుధవారం ఆదేశాలు జారీచేసింది. ఇప్పటివరకు ఏడు దీర్ఘకాలిక వ్యాధుల కు మాత్రమే సెలవు వర్తింపచేస్తున్నారు. గుండెజబ్బు, క్షయ, క్యాన్సర్, కుష్ఠు, పక్షవాతం, మూత్రకోశవ్యాధులు, ఎయిడ్స్, మెదడు సంబంధిత వ్యాధులకు ప్రత్యేక సెలవు ఇస్తున్నారు. ఇటీవల కోల్ ఇండియా స్థాయిలో జరిగిన ఎన్‌సీడబ్ల్యూఏ 11వ వేతన ఒప్పందంలో లివర్ సిరోసిస్ (తీవ్ర కాలేయ వ్యాధి) బాధితులకు కూడా స్పెషల్ లీవ్ వర్తింపచేయాలని నిర్ణయించడంతో సింగరేణి యాజమాన్యం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తీవ్ర కాలేయ వ్యాధికి గురైన కార్మికునికి స్పెషల్ లీవు మంజూరు చేయవచ్చని, వ్యాధి నయమై, విధులకు ఫిట్ అయ్యేంతవరకూ ఉద్యోగికి 50 శాతం వేతన మొత్తం (బేసిక్ పే, వీడీఏ, ఎస్‌డీఏలో 50 శాతం) చెల్లించవచ్చని ఆ ఉత్తర్వుల్లో సింగరేణి వివరించింది.

మానేరులో ఇసుక తోడేళ్లు



వంతెన పియర్‌కు సమీపంలోనే ఇసుక తవ్వకాలు

- వంతెన పియర్ల వద్ద జోరుగా తవ్వకాలు
- వంతెనకు ముప్పు పొంచి ఉందంటున్న ఇంజినీర్లు
- ఇప్పటికే కూలిన గడ్డర్లు.. పట్టించుకోని అధికారులు



కూలిన గడ్డర్ల కింద సేదదీరుతున్న కూలీలు

ముత్తారం(మంథని): నిబంధనల ప్రకారం వంతెన పియర్లకు సుమారు అర్ధ కిలోమీటరు పరిధిలో ఇసుక తవ్వకాలు నిషేధం. కానీ, పెద్దపల్లి - జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దు మానేరులో ఈ నిబంధనేదీ అమలు కావడం లేదు. పియర్ల చెంతనే మీటర్ల కొద్దీ లోతులో ఇసుక తోడేస్తున్నారు. గతేడాది వీచిన గాలిదుమారానికే వంతెనపై గడ్డర్లు కుప్పకూలాయి. అయినా, ఇసుకాసురులు తవ్వకాలు ఆపడం లేదు. అక్రమార్కులను నిలువరించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఏళ్లు గడిచినా పూర్తికాని నిర్మాణం..

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ - జయంశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య మానేరుపై వంతెన నిర్మాణానికి రూ.47.7 కోట్లతో 2016 ఆగస్టు 4న శంకుస్థాపన చేశారు. సుమారు తొమ్మిదేళ్ల గడుస్తున్నా నిర్మాణం పూర్తికాలేదు. గతేడాది 2024 ఏప్రిల్ 23న వీచిన బలమైన ఈదురుగాలులకే పియర్లపై అమర్చిన మూడు గడ్డర్లు కుప్పకులాయి. అయితే, కూలిన గడ్డర్లు పనిచేస్తాయా? లేదా అనే దానిపై జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఇటీవల నాణ్యతా పరీక్షలు జరిపారు. రీ టెండర్‌తో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్.. ఏడాది గడుస్తున్నా వంతెన నిర్మాణాన్ని పునఃప్రారంభించలేదు. పియర్ల వద్ద కనీసం ఇసుక తవ్వకాలనూ నిలువరించలేకపోతున్నారు. ఇది ఆర్ అండ్ బీ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమనే విమర్శలు ఉన్నాయి.

అడ్డుకోకుంటే వంతెనకే ముప్పు..

పియర్ల సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయకపోతే వంతెనకు ముప్పు పొంచిఉందని ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కుప్పకూలిన గడ్డర్ల కింద ప్రమాదం పొంచిఉంది. అయినా, వాటికిందనే ఇసుక పనులు చేసే కూలీలు సేద తీరుతున్నారు. అక్కడ ప్రమాద సూచికల బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు.

నంబర్లు ఉండవు.. రాత్రింబవళ్లు రవాణా

నంబరు ప్లేట్లులేని ట్రాక్టర్లలో అక్రమార్కులు మానేరు నుంచి రాత్రింబవళ్లు ఇసుక తరలిస్తున్నారు. అక్రమార్కులను ఎవరైనా అడ్డుకుంటే దాడులకు తెగబడుతున్నారు. అడ్డుకోవాల్సి అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇసుక తరలింపు ఆపకపోతే పియర్లు కూడా కుప్పకూలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే..

ఓడేడ్-గర్మిళ్లపల్లి మానేరుపై రవాణా సౌకర్యం కోసం నిర్మించిన మట్టిరోడ్డు నిర్వాహకులపై చర్యలు తీసుకున్న రెండు జిల్లాల అధికారులు.. మానేరు వంతెన సమీపంలోనే నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమంగా తవ్వుతున్నా కనిపించడం లేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పలుకుబడి, అధికారుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతోందనే విమర్శలు వస్తున్నాయి. అనుమతి లేకుండా మానేరు మధ్యలోంచే కాకుండా వంతెనను ఆనుకుని తాత్కాలిక మట్టిరోడ్డు ఉండటంతో పియర్ల వద్దే రోజూ ఇసుక తోడేస్తూ వందలాది ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇక్కడ తవ్విన ఇసుకను గర్మిళ్లపల్లి ఆవల.. కలికోటతాళ్లలో నిల్వ చేస్తున్నారు. అక్కడ జేసీబీలతో లారీల్లో లోడ్‌చేస్తూ వరంగల్, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్కులు రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు.

హెచ్చరించినా ఆపడం లేదు

మానేరు వంతెన పియర్ల వద్ద సుమారు అర్ధ కిలోమీటరు మేర ఇసుక తీయొద్దని హెచ్చరించినా అక్రమార్కులు ఆపడం లేదు. రెండు జిల్లాల పోలీసులు, రెవెన్యూ అధికారులు, స్థానికులు దీనిని అడ్డుకోవాలి. కూలిన గడ్డర్లపై జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఇంజినీర్లు ఇటీవల అధ్యయనం చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వంతెన పనులు మళ్లీ ప్రారంభిస్తాం.

– జాఫర్, డీఈఈ, ఆర్ అండ్ బీ, మంథని

భూభారతి చట్టంతో రైతులకు మేలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్

మంథని: భూ భారతి చట్టం-2025 ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. నాగారం రైతువేదికలో భూభారతి చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ నుంచి సీసీఎల్‌ఏ స్థాయి వరకు సమస్యలను పరిష్కారించే వెసులుబాటు ఈ చట్టంలో ఉందన్నారు. రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, భూ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందు తప్పనిసరి భూమి సర్వే చేయించి మ్యాప్ తయారుచేయాల్సి ఉంటుందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు సిద్ధంగా ఉంటారని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణు, మంథని ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: జమ్ముకశ్మీర్‌లో అమాయకులపై ఉగ్రవాదులు దాడిచేసి కాల్చిచంపడం అమానుషమని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఖండించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముష్కరుల దాడిలో అనేకమంది అసువులు బాశారన్నారు. దేశభద్రత విషయంలో గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వం.. జమ్ముకశ్మీర్ దుర్ఘటనపై ఏం సమాధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు. ముష్కరులు ముందుగా హెచ్చరించినా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈదుర్ఘటన చోటుచేసుకుందని ఎమ్మెల్యే ఆరోపించారు. దేశంలో శాంతిస్థాపన కోసం పౌరులంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, కాలువ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, పాతిపెల్లి ఎల్లయ్య, బాలరాజ్ కుమార్, గట్ల రమేశ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమం



కొవ్వొత్తుల ర్యాలీలో కవిత, టీబీజీకేఎస్ నాయకులు

- టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్/పాలకుర్తి/రామగిరి: సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఉద్య మించాలని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. బుధవారం రాత్రి గోదావరిఖని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీరేణుకా ఎలమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారికి కొవ్వొత్తులలో నివాళి అర్పించారు. సెంటినరీకాలనీలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, టీబీజీకేఎస్ హయాంలో అనేక హక్కులు సాధించామన్నారు. రాబోయే రోజుల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. మూడుజెండాల పార్టీ ఇచ్చింది బోనస్ కాదని, బోగస్ అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను కలిసి యూనియన్‌ను బలోపేతం చేద్దామన్నారు. సింగరేణిని ఆగం పట్టించిందే ఎర్ర జెండా పార్టీ అని విమర్శించారు. ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని కోరారు. అంతకుముందు కవితకు పాలకుర్తి మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మిర్యాల రాజిరెడ్డి, మాదాసు రాంమూర్తి, కాపు కృష్ణ, సురేందర్‌రెడ్డి, కొమురయ్య, సంపత్, పర్లపల్లి రవి, ఐలి శ్రీనివాస్, అల్లం పద్మ, కాపురబోయిన శ్రీదేవి, కౌశిక హరి, కౌశిక లత, మాదాసు శ్రీనివాస్, ముల్కల కొంరయ్య, బండి శ్రీనివాస్, బండారి కిరణ్, బత్తిని సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉంటే చెప్పండి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నారని, తూకంలో కోతలు ఉండవని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దకల్వల, పెద్దబొంకూర్, కొత్తపల్లి, మూలసాల, భోజన్నపేట, హన్మంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లితోపాటు ఎలిగేడు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు బ్యాంకర్లు పిలిచి పంట రుణాలిస్తున్నారని, అదే బీఆర్ఎస్ హయాంలో రైతులను బ్యాంకుల్లో డిఫాల్టర్లు చేశారని ఆరోపించారు. నాణ్యమైన ధాన్యాన్ని తెస్తే తూకం త్వరితంగా పూర్తవుతుందని రైతులు గ్రహించాలన్నారు. ప్రతినిధులు స్వరూప, రామ్మూర్తి, నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంతోష్, మహేందర్, మల్లయ్య, పెగడ రమేశ్, బషీరోద్దీన్, భాస్కర్‌రావు, విజయభాస్కర్‌రెడ్డి, దేవేందర్‌రావు, రవీందర్, నరేంద్రచారి, సుధాకర్, సంతోష్‌రెడ్డి, సంతోష్‌రావు, వెంకటేశ్వర్‌రావు, పరుశరాములుగౌడ్, తిరుపతిగౌడ్ ఉన్నారు.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులపై నిరసనలు



నివాళి అర్పిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు, వారి కుటుంబ సభ్యులు

పెద్దపల్లిరూరల్: జమ్మూకశ్మీర్‌లో హిందూ పర్యాటకు లు లక్ష్యంగా ఉగ్రదాడులకు దిగిన ముష్కరుల చర్య ను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కమాన్‌వద్ద రాజీవ్‌రోడ్డుపై బుధవారం బైఠాయించా రు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజే పీ పట్టణ అధ్యక్షుడు రాకేశ్, మండల అధ్యక్షుడు ర మేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు, నాయకులు రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, శ్రీనివాస్, తిరుపతి, రాజగోపాల్, శంకర్, రాజన్నపటేల్, శ్రీకాంత్, హరీశ్, రాజేశం, కృష్ణ, మధుకర్, అంజి, శివసాయి, దేవేందర్, లింగయ్య, రాజు, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో ఐఎన్టీయూసీ నేత బాబర్ సలీంపాషా, ఉద్యోగ గుర్తింపు సంఘం నేత ఆరెపల్లి రాజేశ్వర్, మాజీ కార్పొరేటర్లు కౌలిపాక సుజాత, కొలని కవితారెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులను వెలిగించి అమరులకు నివాళి అర్పించారు.



గెలుపు ఓటమి ఓ పాఠం


ఫెయిలయ్యామని కుంగిపోవద్దు • పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏమీలేదు

ఆవేశంతో జీవితాలను అంతం చేసుకోవద్దు.. ఆలోచన.. ధైర్యంతో అడుగు ముందుకేస్తే ఎన్నో విజయాలు మీ సొంతం. చరిత్ర.. గతం.. వర్తమానం చూస్తే అనేక విషయాలు ఇట్టే దోహదపడుతాయి. ఎందుకు పనికిరారు అని పలువురితో ఛీత్కారాలు ఎదుర్కున్నవారు కష్టపడి విజయ తీరాలకు చేరుతున్నారు. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. గెలుపు.. ఓటమికి నాంది అనేదానిని మరవొద్దు. సచిన్ టెండూల్కర్ అంటే తెలియని వారు ఉండరు. పదోతరగతి కూడా పాస్‌కాలేని ఆయన బ్యాట్ ఝులిపిస్తే.. పరుగుల వర్షమే కురిసేది. క్రికెట్ ఆడితే లక్షల కళ్లు ఆయనవైపే ఉండేవి. ఎన్నో ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఆయన క్రికెట్ దిగ్గజంగా ఎదిగిన విషయం మరవొద్దు.. అంతేకాదు.. శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మోటార్ న్యూరాన్ అనే వ్యాధి బారిన పడ్డా.. మనోధైర్యం కోల్పోలేదు. ఓ దశలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆయన గొప్ప పరిశోధకుడై ప్రపంచమే మెచ్చుకునే వాడయ్యాడు.



హుజూరాబాద్:

ప్రతిభ కొందరికే పరిమితం కాదు. ప్రతీ మనిషిలోనూ ఒక ప్రత్యేకత ఉంటుంది. దాన్ని వెలికితీసి, కఠోర సాధన చేస్తే జీవితంలో గొప్ప వ్యక్తిగా ఎదగొచ్చు. అలా కాదని నేనేం చేయలేను.. నాతో కాదు.. నేనింతే అంటూ కుంగిపోవద్దు. చదువూ అంతే.. పుస్తకాన్ని నేస్తంగా మలుచుకుని చదివితే విజయం నీ బానిస అవుతుంది. పరీక్ష నీతో స్నేహం చేస్తుంది. ఫలితం ఎప్పుడూ నీ వెంటే నడుస్తుంది. విద్యార్థులకు 'పరీక్ష'కాలం ముగిసింది. ఫలితాల సమయం సా గుతోంది. మంగళవారం నాటి ఇంటర్ ఫలితాల్లో చాలా మంది ప్రతిభ చూపారు. కొందరు ఫెయిలయ్యారు. త్వరలో పదోతరగతి ఫలితాలు రానున్నాయి. ఫలితాలను జీవితంలో ఒక భాగం మాత్రమే చూడాలి. ఓటమి గెలుపునకు గట్టి పునాదిగా మారుతుందని గ్రహించాలి. మళ్లీ ప్రయత్నించి, తప్పులను సవరించుకుని, కన్నీళ్లు పెట్టుకున్న చోట తలెత్తుకుని చూడాలి తప్పా.. విఫల మయ్యామని కఠినమైన నిర్ణయాలు తీసుకోవద్దు. గెలుపైనా ఓటమైనా.. ఓ పాఠంగా నేర్చుకోవాలి.



నిలబడి గెలవాలి

- నిరాశ మనిషిని నిలువునా చీల్చుతుంది. ఆశ జీవితాలను నిలబెడుతుంది. ఈరోజు పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, ఫెయిల్ అయ్యామని కుంగిపోవడం, నిరాశకు గురయ్యే ఆలోచనలు పిరికి వారికే తప్ప ధైర్యవంతులకు రావనేది గ్రహించాలి.
- ఓటమి గెలుపునకు నాందిగా మారుతుంది. ఒకసారి ఓడితేనే భవిష్యత్‌లో సమస్యలను అధిగమించే గుణాన్ని నేర్చుకుంటారు. ధైర్యవంతులుగా తయారవుతారు. పాజిటివ్ ఆలోచనే విజయానికి బాట.
- ఆవేశంతో తీసుకునే నిర్ణయం సరైంది కాదనే వాస్తవం గుర్తించండి. ఓటమి విజయానికి తొలిమెట్టు కావాలి. కెరటంలా ఎగిసిపడాలి.

ఇవీ ముఖ్యం..

- పరీక్ష ఫలితాల వేళ పిల్లలను హేళన చేసే విధంగా ఎవరూ మాట్లాడొద్దు. ఆశించిన ఫలితం వస్తే అభినందించాలి. ఫెయిల్ అయినా, మార్కులు తక్కువ వచ్చినా ఓదార్చి ప్రోత్సహించాలి.
- అనుకున్న ఫలితం సాధించడంలో విఫలమైనా, తక్కువ మార్కులొచ్చినా ఏమీ కాదు.. జీవితం చాలా ఉంది. మీ వెంటే మేమున్నాం. మళ్లీ ప్రయత్నిద్దామన్న భావన కల్పించాలి.
- ఫలితాల వేళ పిల్లలు ఆందోళనకు గురవుతారు. నిరాశ, నిస్పృహ లోకి వెళ్తారు. అందుకే ఈ సమయంలో వారిని ఉత్సాహపర్చే వాతావరణం అవసరం. కుటుంబ సభ్యులు.. చుట్టూ ఉన్నవారు ఆ బాధ్యత తీసుకోవాలి.

తల్లిదండ్రుల పాత్ర కీలకం

- పరీక్షల ఫలితాల సమయంలో తల్లిదండ్రులు పిల్లలతో గడపాలి. మార్కులు తక్కువ వచ్చినా.. లేదా ఫెయిల్ అయినా వారికి ధైర్యం ఇచ్చి మానసిక బలాన్ని అందించేవిధంగా వ్యవహరించాలి.
- విద్యార్థులు కూడా మరొకసారి సాధించి చూపుతామనే గట్టి పట్టుదలతో ధైర్యంగా ఉండి సాధించాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు క్రియాశీలక పాత్ర పోషించాలి. పిల్లలను ఒంటరిగా వదలేయొద్దు.
- వారి కదలికలపై ఓ కన్నేసి ఉంచుతూనే ప్రముఖుల స్ఫూర్తిదాయక జీవితాల గురించి తెలపండి. ఫెయిలైతే చదువుకు ఆటంకం కాదని చెప్పండి. మున్ముందు మంచి మార్కులు, ఉత్తీర్ణత సాధించే వీలుందని ధైర్యం నూరి పోయాలి.

మనోధైర్యమే ఆయుధం



విద్యార్థులు పరీక్ష ఫలితాలు వచ్చిన సమయంలో ఆందోళనకు గురికాకుండా, పరిస్థితిని గమనించి ధైర్యంగా ముందుకు సాగాలి. ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం ముగిసిపోలేదు. మొదటి విజయానికి బాసటగా భావించి, తప్పు ఎక్కడ జరుగుతుందో గమనించి, సరిచేసుకుని ముందుకు సాగాలి. – ఎల్.వర్షి, ప్రభుత్వ మానసిక వైద్య నిపుణుడు, హుజూరాబాద్

నిరుత్సాహం వద్దు



పరీక్ష ఫలితాలు జీవితాన్ని నిర్ణయించవు. ఓటమి నుంచి ఏం నేర్చుకున్నామో గ్రహించి, ఎక్కడ లోపం ఉందో పసిగట్టి, పటిష్ట ప్రణాళికతో నిరుత్సాహపడకుండా ముందుకెళ్తే విజయం బానిసవుతుంది. 20 ఏళ్ల జీవితంలో విద్యార్థులు కష్టపడితే 50ఏళ్ల జీవితాన్ని సంతోషాలతో గడపొచ్చు.

– శ్రీనివాస్‌జి, ఏసీపీ, హుజూరాబాద్

క్లుప్తంగా

అమెరికాలో 'ఖని' యువకుడు మృతి


శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన సాఫ్ట్‌వేర్ లక్కేడి శ్రీధర్‌రెడ్డి(42) అమెరికాలో మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. స్థానిక ఎల్బీనగర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి లక్కేడి మాధవరెడ్డి ప్రస్తుతం ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు శ్రీధర్‌రెడ్డి పదేళ్లుగా అమెరికాలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆయన భార్య కూడా అక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. మూడు నెలల క్రితం శ్రీధర్‌రెడ్డి క్యాన్సర్‌కు గురయ్యారు. అక్కడే చికిత్స పొందుతున్నారు. కొడుకును చూసుకోవడానికి రెండు నెలల క్రితం తండ్రి మాధవరెడ్డి కూడా అమెరికా వెళ్లారు. ఈ నేపథ్యంలోనే భారతకాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం శ్రీధర్‌రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. మృతదేహాన్ని భారత్‌కు తరలించడానికి ఆలస్యం అయ్యే అవకాశాలు ఉండడంతో అమెరికాలోనే అంత్యక్రియలు నిర్వహించారు. అక్కడ జరిగిన రెడ్డి అంత్యక్రియలను గోదావరిఖనిలోని అతడి సోదరుడు రమణారెడ్డి, బంధువులు ఆన్‌లైన్ లో వీక్షించారు.

పోయిందనుకున్న బంగారం దొరికింది

మల్యాల(చొప్పదండి): ఏమరుపాటులో ఓ గృహిణి ఓ వ్యక్తికి బియ్యం విక్రయించింది. అయితే అందులో మూడు తులాల బంగారం దాచిన విషయాన్ని మరిచిపోయింది. మరుసటి రోజు విషయం గమనించిన ఆ గృహిణి సదరు వ్యక్తిని పట్టుకుని విచారించడంతో బంగారం దొరికింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మల్యాల మండలం నూకపల్లికి చెందిన ఓ గృహిణి మూడు రోజుల క్రితం దొడ్డుబియ్యాన్ని ఓ వ్యక్తికి విక్రయించింది. అందులో మూడు తులాల బంగారాన్ని దాచిన విషయాన్ని మరిచిపోయింది. అదేరోజు సాయంత్రం బంగారం దాచిన విషయం గుర్తుకొచ్చి.. బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తి కోసం గాలించింది. అయినా అతడి ఆచూకీ లభించలేదు. రెండు రోజులు క్రితం సదరు వ్యక్తి నూకపల్లికి రాగా.. గృహిణి అతడిని ప్రశ్నించింది. తాను బంగారాన్ని చూడలేదని, బియ్యాన్ని గొల్లపల్లి మండలం గుంజపడుగుకు చెందిన ఓ వ్యక్తికి విక్రయించినట్లు చెప్పడంతో మంగళవారం సదరు మహిళా కుటుంబసభ్యులు గుంజపడుగుకు వెళ్లి బియ్యంలో వెదికారు. అందులో బంగారం బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.

యువతి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: పోచమ్మవాడలో గంగధరి ప్రసన్నలక్ష్మీ(28) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉప్పునీటి గంగాధర్ కుమార్తె ప్రసన్నలక్ష్మీని వెలటూర్ మండలం రాంనూర్ గ్రామానికి చెందిన గంగధరి తిరుపతికి ఇచ్చి 2023లో వివాహం చేశారు. వీరికి ఏడాది బాబు ఉన్నాడు. తిరుపతి వెళ్లేందుకని ఇటీవలే జగిత్యాలలోని పుట్టింటికి వచ్చింది. ఇంతలో ఏమైందో తెలియదుగానీ.. ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కర్మకాండకు వెళ్లి యువకుడు గల్లంతు

జగిత్యాలక్రైం: కర్మకాండకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో యువకుడు గల్లంతైన సంఘటన జగిత్యాలలో చోటుచేసుకుంది. స్థానిక మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన నీలి మల్లికార్జున్ నానమ్మ ఇటీవల మృతిచెందింది. బుధవారం కర్మకాండ నిర్వహించారు. శ్మశానవాటిక పక్కనే ఉన్న చింతకుంట చెరువులో స్నానం చేస్తుండగా మల్లికార్జున్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గజఈతగాళ్లను రంగంలోకి దింపినా ఆచూకీ లభ్యం కాలేదు. యువకుడు మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు రోదిస్తున్నారు.


బూడిదతో అస్తవ్యస్తంగా తయారైన ఓ ఇల్లు, సామగ్రి


ఇంట్లో పేరుకుపోయిన బూడిద

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..

- అర్ధరాత్రి జరిగితే బూడిద కింద సజీవ సమాధి అయ్యేవారు
- కాలనీలను ముంచెత్తిన బూడిదనీరు
- ఆందోళనలో కాలనీవాసులు


ఇంట్లోకి చేరిన బూడిదనీరు


కాలనీని ముంచెత్తిన బూడిదనీరు

రామగుండం: పట్టణంలోని అక్బర్‌నగర్ కాలనీ పక్కనున్న ఎన్టీపీసీ బూడిద పైపులైన్ బుధవారం రాత్రి ఒక్కసారిగా పగిలిపోవడంతో స్థానికులు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. విద్యుత్ కేంద్రం నుంచి యాష్‌పాండ్ వరకు నిర్మించిన బూడిద పైపులైన్ పగిలిపోవడంతో నీటితోకూడిన వేడిబూడిద పైకి ఎగజిమ్మింది. సమీపంలోని ఇళ్లను ముంచెత్తింది. అప్పుడే ఎండతగ్గడంతో ఆరుబయట కూర్చొని చల్లటిగాలికి సేద తీరుతున్న కాలనీవాసులు.. ఒక్కసారిగా బూడిద పైపులైన్ పగిలి భారీశబ్దం రావడంతో భయాందోళనకు గురయ్యారు. కొన్నిక్షణాలు అసలు ఏం జరిగిందో తెలియక దిక్కులు చూస్తూ ఉండిపోయారు. ఈక్రమంలోనే బూడిదనీరు ఇళ్లలోకి చేరింది. కనీసం ప్రాణాలైన దక్కించుకుందామని కాలనీవాసులు దూరంగా పరుగులు పెట్టారు. బూడిద పైపులైన్ పగిలిందని గుర్తించి అదే కాలనీలో నివాసముండే కొండల రాజేందర్ వెంటనే ఎన్టీపీసీ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు వెంటనే బూడిద సరఫరాను నిలిపివేశారు. అధికారులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగినా, అర్ధరాత్రి పైపులైన్ పగిలినా పదుల సంఖ్యలో ప్రజలు బూడిదకింద సజీవ సమాధి అయ్యేవారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బూడిద నీరు కారింది



మా ఇంటికి కొద్దిదూరంలోని పైపు పగిలి బూడిదనీరు పైకిఎగజిమ్మింది. మా ఇంటిపై వేడి బూడిదపడింది. ఆ వేడిబూడిద ఒత్తిడితో రేకులు పగిలిపోయాయి. బూడిద ఇంట్లోకి చేరింది. మూడు గదుల్లో బూడిద చేరింది. కిచెన్‌లోని నిత్యావసరాలు పనికిరాకుండా పోయాయి. బెడ్స్, తలుపులు, గోడలు తడిసి ముద్దయ్యాయి.

– సజ్జు, స్థానికుడు

శాశ్వత పరిష్కారం చూపించాలి

ఎన్టీపీసీ బూడిదనీరు తరలించే పైపు పగిలిన ఘటనలో నష్టపోయిన బాధిత కుటుంబాలను శాశ్వత ప్రాతిపదికన ఆదుకోవాలి. ఇళ్లలో నిండిన బూడిదను వెంటనే తొలగించాలి. బూడిదతో శిథిలావస్థకు చేరిన నివాసాలను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలి. ఇందుకోసం ఎన్టీపీసీ వెంటనే ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలి. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఉపేక్షించేదిలేదు.

– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

పైసాపైసా జమచేసి ఇల్లు కట్టుకున్న



నా భర్త మీరా హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మా బతుకులు రోడ్డున పడ్డాయి. పైసాపైసా కూడబెట్టి రెండు గదులతో ఇల్లు కట్టుకున్నా. ఇప్పుడు బూడిద పైపు పగిలి ఇల్లంతా బూడిదతో నిండిపోయింది. కూలీపని చేసుకుంటేనే దినం గడిచే పరిస్థితి. ఇప్పుడు నా బతుకు ఎలా ఉంటుందో అర్థం కావడం లేదు. ఎన్టీపీసీ ఆదుకోవాలి.

– ఖైరున్నీసా, స్థానికురాలు

ఇంట్లోకి చేరింది



మా ఇంటి వెనుకాల ఉన్న పైపు పగిలి వేడి బూడిద ఇంట్లోకి వచ్చిచేరింది. క్షణాల్లో మోకాలి లోతుకు బూడిద పేరుకుపోయింది. సామాను పూర్తిగాబూడిదమయమైంది. అర్ధరాత్రి ఈ ఘటన జరిగితే ప్రాణాలపై ఆశలు ఉండేవి కాదు. ఎన్టీపీసీ అధికారులు స్పందించి మా ఇళ్లకు రక్షణ కల్పించాలి. – ఖదీరా, స్థానికురాలు

జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు కరీంనగర్‌రోడ్‌లోగల ఓ చిట్‌ఫండ్‌లో రూ.5 లక్షల డిపాజిట్ చేశాడు. కాల పరిమితి ముగిసి ఏడాది కావస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో 15 రోజుల క్రితం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సదరు చిట్‌ఫండ్‌పై కేసు నమోదు చేశారు.

జగిత్యాల పట్టణంలోని ఓ షాపు నిర్వాహకుడు రాజు కరీంనగర్‌రోడ్‌లోగల లో చిట్‌ఫండ్‌లో రూ.2 లక్షలు డిపాజిట్ చేశాడు. కాల పరిమితి ముగిసి చాలా రోజులు అవుతున్నా డబ్బులు చెల్లించకపోవడంతోపాటు తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడు. ఇటీవల బాధితులు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు సదరు చిట్‌ఫండ్‌పై కేసు నమోదు చేశారు.

'చీట్'ఫండ్ వ్యాపారం

- జగిత్యాల జిల్లాలో ప్రతినెలా రూ.70 కోట్ల లావాదేవీలు
- కాలపరిమితి ముగిసినా డబ్బులు చెల్లించని వైనం
- న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తున్న ఖాతాదారులు



జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో విచ్చలవిడిగా చిట్‌ఫండ్ వ్యాపారం కొనసాగుతోంది. ఇది చాలదన్నట్లు అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చే ఫైనాన్స్ కంపెనీలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. జిల్లాలో దాదాపు 33 చిట్‌ఫండ్ కంపెనీలు ఉన్నాయి. వీటిలో కేవలం పదింటికి మాత్రమే లైసెన్స్ ఉంది. అలాగే జిల్లాలో 100కు పైగా ఫైనాన్స్‌లు నడుస్తున్నాయి. అనధికారికంగా మరో 150 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. చిట్‌ఫండ్ల వ్యాపారం రూ.80 కోట్ల వరకు.. ఫైనాన్స్ వ్యాపారం రూ.70 కోట్ల వరకు జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఫైనాన్స్ నిర్వాహకులు అయితే తెల్ల పేపర్లపై లేకుంటే ఖాళీచెక్కులపై సంతకాలు చేయించుకుని 4 నుంచి 8 శాతం వడ్డీకి అప్పులిస్తున్నారు. పెద్ద ఎత్తున వడ్డీ వసూలు చేస్తున్నా.. నిబంధనలకు విరుద్ధంగా చిట్‌ఫండ్ ఫైనాన్స్ కొనసాగిస్తున్నా.. వారిపై నిఘా కరువైంది.

చిట్‌ఫండ్స్ మోసాలు

జిల్లాలో ఉద్యోగులు, వ్యాపారులు, వైద్యులు, ఇతరత్రా వ్యక్తుల నుంచి లైసెన్స్‌డ్ చిట్‌ఫండ్ నిర్వాహకులు పెద్ద ఎత్తున చిట్టీలు వేయించుకొని కాలపరిమితి ముగిసినా డబ్బులు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ చిట్‌ఫండ్ కార్యాలయంలో బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. చిట్‌ఫండ్స్ కంపెనీలో చిట్టీ తీసుకునే వారు ప్రభుత్వ ఉద్యోగితో ష్యూరిటీగా తీసుకొని డబ్బులు చెల్లిస్తారు. కానీ కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా సమయానికి డబ్బులు ఇవ్వకపోవడం చిట్ ఫండ్ మోసాలకు దారితీస్తోంది. జిల్లాలో రిజిస్టర్ లేని చిట్టీలు కోట్ల వ్యాపారంలో కొనసాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కొందరు చిట్టీ నిర్వాహకులు వ్యాపారంలో నష్టాలు వచ్చాయని పారిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.

తాకట్టు వ్యాపారం

జిల్లాలో తాకట్టు వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో చాలామంది డబ్బులు అవసరమున్న వారు వాహనాల పేపర్లతోపాటు బంగారం, భూమి కాగితాలు పెట్టి అధిక వడ్డీకి అప్పు ఇస్తున్నారు. అప్పు తీసుకున్న వారు సకాలంలో చెల్లించకుంటే తాకట్టు పెట్టిన వస్తువులను వ్యాపారులు అమ్ముకుంటున్నారు. చాలా మంది వడ్డీ వ్యాపారులు తెల్లపేపర్లపై స్టాంప్ పేపర్లు, చెక్కులపై సంతకాలు చేయించుకుని ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారు. రిజిస్టర్ అయిన చిట్‌ఫండ్స్ నిర్వాహకులు డిపాజిట్లు సేకరించి.. కాలపరిమితి ముగిసినా డిపాజిటర్లకు డబ్బులు చెల్లించకుండా సుమారు ఏడు కంపెనీలు తమ కార్యకలాపాలు నిలిపివేశాయి. ఫలితంగా బాధితులు పోలీస్‌స్టేషన్‌లు, కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

అనుమతుల్లేని ఫైనాన్స్‌లపై చర్యలు



జగిత్యాల జిల్లా కేంద్రంలో అనుమతులు లేని ఫైనాన్స్‌లు, చిట్‌ఫండ్స్‌పై కఠిన చర్యలు చేపడతాం. ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. మూతపడిన చిట్‌ఫండ్స్‌పై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశాం.

– రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూకు హాజరైన దరఖాస్తుదారులు

కోల్‌సిటీ(రామగుండం): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నవారికి బుధవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ప్రారంభించారు. ఈనెల 21వ తేదీ వరకు మొత్తం 11,446 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 8,195 మంది బల్దియా కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించారు. యూనిట్ల వారీగా అర్హులను గుర్తించడం కోసం ఈనెల 30వ తేదీ వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు కమిషనర్(ఎఫ్‌ఏసీ) అరుణశ్రీ తెలిపారు. తొలిరోజు ఎన్టీపీసీ, రామగుండం ఏరియాలకు చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ పరిధిలోని దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ రెండు బ్యాంకులకు 1,050 మంది దరఖాస్తు చేసుకోగా, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఇద్దరే అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించడంతో ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి పర్యవేక్షించారు. అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్, పాన్‌కార్డు, రేషన్ కార్డు/ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలను వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు.


కట్నం వేధింపులకు యువతి బలి


దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కుటుంబీకులు


జమున (ఫైల్)

జగిత్యాలక్రైం/బుగ్గారం: కొడిమ్యాల మండలకేంద్రంలో వివాహిత దుబ్బాక జమున (23) కట్నం వేధింపులకు బలైంది. స్థానికుల కథనం ప్రకారం.. బుగ్గారం మండలకేంద్రానికి చెందిన జమునను ఏడాది క్రితం కొడిమ్యాలకు చెందిన దుబ్బాక రాహుల్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆ సమయంలో కట్నకానుకలతోపాటు సామగ్రి, ఇతర లాంఛనాలు ముట్టజెప్పారు. కొద్దికాలంగా రాహుల్ అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక జమున క్రిమిసంహారక మందు తాగింది. అనంతరం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జమనను కట్నం కోసం వేధించి భర్తతోపాటు అత్తమామలు హత్య చేశారంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని నిందితులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు. మృతురాలి తల్లి కొమ్ము పోశవ్వ ఫిర్యాదు మేరకు జమున భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. జమున మృతదేహానికి బుగ్గారంలో దహన సంస్కారాలు నిర్వహించగా.. తల్లి పోశవ్వ తలకొరివి పెట్టింది.

విలీనం మంచికేనా?


తెలంగాణ రాజపత్రము
THE TELANGANA GAZETTE
PART IV-B EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY
TELANGANA ACTS, ORDINANCES AND REGULATIONS ETC.
ACT No. 17 OF 2025.
AN ACT FURTHER TO AMEND THE TELANGANA MUNICIPALITIES ACT, 2019.

TELANGANA GAZETTE EXTRAORDINARY [Part IV-B]

ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్

- గ్రామీణులపై పన్నుల భారం
- ఉపాధిహామీ పనులకు మంగళం
- అభివృద్ధి పనులపైనా అనేక అనుమానాలు

గ్రామాల సమాచారం		
గ్రామం	ఓటర్లు	జనాభా
కుందనపల్లి	2,609	3,038
అక్బర్‌నగర్	750	954
లింగాపూర్	1,744	2,100
ఎల్కలపల్లి	497	600

రామగుండం: మున్సిపల్ కార్పొరేషన్‌కు అతిసమీపంలోని గ్రామాలను నగరంలో విలీనం చేస్తూ ప్రభుత్వం గెజిట్ జారీచేసింది. విలీనం లేకుండానే కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని గత ఫిబ్రవరిలో నిర్ణయించినా.. ప్రస్తుత పరిస్థితులు అందుకు విరుద్ధంగా మారుతున్నాయి.

నగరంలో విలీనమయ్యే గ్రామాలు ఇవే..

అంతర్గాం మండలం లింగాపూర్, కుందనపల్లి అనుబంధ అక్బర్‌నగర్, ఎల్కలపల్లి, రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామాలను రామగుండం నగరంలో విలీనం చేస్తున్నట్లు గెజిట్ జారీచేశారు. విలీనంపై కొందరు గ్రామస్తులు పెదవి విరుస్తుండగా, మరికొందరు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గైడ్‌లైన్స్ అందలేదు



లింగాపూర్, కుందనపల్లి అనుబంధ అక్బర్‌నగర్ గ్రామాలను రామగుండం కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ గెజిట్ విడుదలైంది. కానీ, విలీన గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి, ఇతర పనులపై మాకు గైడ్‌లైన్స్ అందలేదు.

– వేణుమాధవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఏసీపీ శుభంప్రకాశ్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ బుధవారం తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. గతేడాది జూలైలో గుంటూరుపల్లిలో దొంగలు తాళంవేసి ఉన్న ఇంట్లో చొరబడి రూ.2.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ రోడ్డులోని రాజేంద్రప్రసాద్ ఇంటి తాళాలు పగులగొట్టి మద్యం సీసాలు, బైక్ అపహరించారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాకు చెందిన ప్రదీప్, హత్రుసింగ్, జితేన్‌లు ఈ దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందని ఏసీపీ వివరించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు ప్రదీప్‌ను గత నెలలో రిమాండ్‌కు పంపించామని, మరో నిందితుడైన హత్రుసింగ్‌ను కొత్తపల్లి ఎస్సై ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో దార్ జిల్లా నరవాలిలో అదుపులో తీసుకొని బుధవారం కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈకేసులో మరో నిందితుడు జితేన్ పరారీలో ఉన్నాడని త్వరలోనే ఆయనూ పట్టుకుంటామని ఏసీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది శ్రీనాథ్, అబ్దుల్ ఖదీర్, షరీఫ్, సాంబరెడ్డి, దేవేందర్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తపల్లి: నాగులమల్యాల గ్రామానికి చెందిన మొగిలిపాలెం గంగరాజు(42)బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలో పనిచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న నాగులమల్యాలకు చెందిన గంగారాజు ప్రతి రోజు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తుంటాడు. బుధవారం సర్వారెడ్డిపల్లిలో పనిముగించుకొని తన వాహనంపై నాగులమల్యాలకు వస్తుండగా కొత్తపల్లి శివారులోని వెలిచాల ఎక్స్‌రోడ్ దగ్గర లారీ ఢీకొట్టింది. గంగారాజుకు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అజాగ్రత్తగా లారీ నడిపి తన తండ్రి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గంగరాజు కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రాజన్న హుండీ ఆదాయం రూ.2.01 కోట్లు

వేములవాడ: రాజన్నకు భక్తుల ద్వారా 29 రోజుల్లో రూ.2.01కోట్ల ఆదాయం సమకూరింది. ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో బుధవారం హుండీలను లెక్కించారు. రూ.2,01,53,852 నగదు, 184 గ్రాముల బంగారం, 12.300 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు.